క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: సుశ్రుత ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సుశ్రుత ఆస్పత్రిలో పిల్లలు పుట్టాలని కోరుకునే వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సెమెన్ ఎనాలసిస్, అల్ట్రాసౌండ్, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పిల్లలు కావాలనుకునే దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానం కోసం అన్ని రకాల వైద్యసేవలు సుశ్రుతలో అందుబాటులో ఉన్నాయని, అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 88852 21877, 9866 457501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ముమ్మరంగా ప్రజాపాలన దరఖాస్తుల నమోదు

తాడూరు: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియ, ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయా గ్రామపంచాయతీల కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేసుకుంటున్నారు. గృహజ్యోతి పథకం అమలు కావాలంటే అందుకు సంబంధించిన ఆధార్, ఫోన్‌నంబర్, రేషన్‌కార్డు వంటివి పరిశీలించి నమోదు కార్యక్రమంలో నిమగ్నమైనట్లు ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్ తెలియజేశారు.

ఎంపీకి ఘన స్వాగతం



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన డా.మల్లురవి శనివారం తిమ్మాజీపేట, బిజినేపల్లి మండలాలకు రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో కార్యకర్తలు గజమాలతో ఆహ్వానించారు. ముందుగా మరికల్ నుంచి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీలో డా.మల్లురవితో పాటు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహాలకు, ఇతర మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వట్టెం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ.. ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరితహారానికి గుంతలు సిద్ధం చేయాలి

కోడేరు: హరితహారం మొక్కలు నాటడానికి గుంతలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి, పస్పులలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వానాకాలం సీజను ప్రారంభం కావడంతో గట్లు, గుట్టలు, ప్రభుత్వ భూములు, రోడ్డుకు ఇరువైపుల కూలీలతో హరితహారం కోసం గుంతలు తీసి ఉంచాలన్నారు. గతంలో నాటిన మొక్కలకు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రవితేజ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్: మొన్న నీట్ పరీక్ష పేపర్ లీక్, నిన్న యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేస్తూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుందని, ఇది సరైన పద్ధతి కాదని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మారేడు శివశంకర్ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కోర్టు కల్పించుకుని సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశం అంతా నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీపై విద్యార్థులకు ఆందోళన గురవుతున్నారని, అది మరువకముందే యూజీసీ పరీక్షలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడటమే అని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన గిరిజన విద్యార్థి



వెల్దండ: మండల పరిధిలోని కళ్యాణవాగుతండాకు చెందిన రాత్లావత్ ఫణీందర్ శనివారం ఐఐటీలో వారణాసిలో సీటు సాధించాడు. తండాకు చెందిన రాత్లావత్ ఫణీందర్ జేఈఈలో అడ్వాన్స్‌లో 673వ ర్యాంక్ సాధించాడు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు. ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు తండావాసులు, గిరిజన నాయకులు అభినందించారు.

సంక్షేమానికి కట్టుబడి ఉంటాం..

అచ్చంపేట: ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం రూ.25 లక్షలతో చేపట్టనున్న అచ్చంపేట నియోజకవర్గ ముదిరాజ్ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృత్తి పరంగా వారికి అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. మత్స్యకారుల సహకార సంఘాల ద్వారా వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీపీ పర్వతాలు, వెంకటయ్య, మల్లేష్, కాశన్నయాదవ్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

అచ్చంపేట అంబేద్కర్ ప్రజా భవనంలో శనివారం నియోజకవర్గంలోని వంగూరు, లింగాల, బల్మూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, రామ్‌ప్రసాద్‌గౌడ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ ప్రజా భవన్‌లో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఆయిల్‌పాం తోటల పరిశీలన

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను ఉద్యానశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగుతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని రైతు వెంకట్‌రెడ్డి మూడేళ్ల కిందట తోటను సాగు చేసే క్రమంలో తాము తెలియజేసిన పద్ధతులను పాటించడంతో మొక్కల ఎదుగుదలతో పాటు కోతకు వచ్చిందన్నారు. 4 ఎకరాలు సాగు చేశాడని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. తోటల పెంపకంపై దృష్టి సారిస్తే.. ప్రభుత్వం అన్ని రకాల సబ్సిడీలను అందజేస్తుందన్నారు. ఆయా గ్రామాల రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



తోట సాగుపై రైతులకు వివరిస్తున్న అధికారి

అసద్‌పూర్ భూములను పేదలకు పంచాలి

కొల్లాపూర్: పట్టణంలోని కేఎల్ఐ అతిథిగృహంలో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు శుక్రవారం నిర్వహించారు. తరగతులను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు ప్రారంభించి ప్రసంగించారు. పేదల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మొలచింతలపల్లి సమీపంలోని అసద్‌పూర్ శివారులోని భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సురభి సంస్థానాధీశులకు చెందిన ఈ భూములను దశాబ్దాల కాలంగా స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారని, ల్యాండ్ సీలింగ్ యాక్టు అమలు చేసి అర్హులైన రైతులకు భూములు పంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు బాలపీరు, సలీం, కిరణ్‌కుమార్, లలిత, ముంతాజ్‌అలీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న పర్వతాలు

పోలీసుల వ్యవహారం సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడిని ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టగా.. తోపులాటలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ కాలికి గాయం కావడం అటు ఉంచితే అరెస్ట్ అవుతానన్నా అక్కడి పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, ఇందుకు కేంద్ర మంత్రి బాధ్యత వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అవకతవకలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటె అది మరవకముందే దేశవ్యాప్తంగా జరిగిన యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడుకోవడమేనన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పాడి రైతుల సమస్యలపై ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఊర్కొండ: పాడి రైతులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ నాయకులు రైతులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి బీజేపీ నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మండల కేంద్రంలోని జడ్చర్ల-కోదాడ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల పక్షపాతి అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పాడి రైతులకు సంబంధించి రూ.4 లీటర్‌పై ప్రోత్సాహకాన్ని గత ప్రభుత్వం అందిస్తుండగా.. దాన్ని కొనసాగించడంలేన్నారు. పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, రాజేందర్‌గౌడ్, పరశురాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


బొగ్గుగనుల బహిరంగ వేలాన్ని నిలిపివేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వం బొగ్గుగనుల బహిరంగ వేలాన్ని వెంటనే నిలిపి వేయాలని, గనులను సింగరేణికి కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ గాంధీ పార్క్ వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి గనుల విషయంలో అధికారం లేకపోయినా.. ఇతర పార్టీల మద్దతుతో అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే ప్రైవేటీకరణకు తెర లేపిందన్నారు. శ్రావణపల్లి కోల్డ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అరవిందో సంస్థలకు కేటాయించిన బొగ్గును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, అంతటి కాశన్న, శివశంకర్, కురుమయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని సాయికృప ఆస్పత్రి ఎదుట వాల్మీకి, ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. గతంలో ఆస్పత్రిలో పనిచేసిన లక్ష్మీ చోరీకి పాల్పడిందంటూ ఏడాది కిందట ఆస్పత్రి నిర్వాహకులు కొండా శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయమై ఈ నెల 20న కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన లక్ష్మీ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. లక్ష్మీ మృతికి ఆస్పత్రి నిర్వాహకులే కారణమని ఆరోపిస్తూ శుక్రవారం వాల్మీకి, ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్ సంఘాల నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆస్పత్రిని మూసివేయాలని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుమార్తె చదువులకు, జీవనభద్రతకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు తెలియజేయడంతో సీఐ మహేష్, ఎస్ఐ హృషికేష్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. ఆందోళన విరమించాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురాంనాయుడు, వాల్మీకి సంఘం నాయకులు ప్రసాద్, మధు, గోవర్దన్, రాంచందర్, రాఘవేంద్ర, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనపై ఫిర్యాదు

ఆస్పత్రి ఎదుట ఆందోళన చేసిన వారిపై డాక్టర్ కొండా శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి పేరును, తమ కుటుంబాన్ని బద్నాం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆందోళనలో పాల్గొన్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాయకుల పరామర్శ

నాగర్‌కర్నూల్ రూరల్: మొలచింతలపల్లిలో లైంగిక దాడికి గురైన చెంచు ఈశ్వరమ్మ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బీఎస్ఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఈశ్వరమ్మను పరామర్శించారు.

అమరగిరిలో వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని అమరగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చెంచుగూడెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు ఆరోగ్య పరీక్షలు, చంటి పిల్లలకు టీకాలు వేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జీహెచ్ఎం చంద్రుడు పేర్కొన్నారు. శనివారం పెద్దాపూర్ ఉన్నత పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు ఆకర్షితులు కావొద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రాజశేఖర్, వెంకటశైలం, పోషయ్య, లత, రాఘవేందర్, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

మన్ననూర్: స్థానిక గిరిజన ఉన్నత పాఠశాల హెచ్ఎం సిద్ధార్థ మహదేవ్, ఎంపీటీసీలు, గ్రామస్తుల సమక్షంలో అమ్మ ఒడి చైర్మన్ బక్కమ్మ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను ఉద్దేశించి పాఠశాల పూర్వవిద్యార్థులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం మాట్లాడారు. ఈ పాఠశాలకు విద్య, క్రీడలు, సాంస్కృతిక తదితర అంశాల్లో ఘనమైన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో బక్కమ్మ, బాలస్వామి, వెంకటరమణ, సత్యనారాయణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల అందజేత

ఉప్పునుంతల: స్థానిక బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో శనివారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మర్యాద రుక్మారెడ్డి సహకారంతో అతని తమ్ముడు మర్యాద కృష్ణారెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యా ప్రగతి, విద్యార్థులు సాధించిన గురుకుల సీట్లు తదితర అంశాలను తెలుసుకొని గ్రామంలోని పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిగా తాను విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించానని తెలిపినట్లు పాఠశాలల హెచ్ఎంలు లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి తెలియజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, బాలమణి, వెంకటేష్, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

తెలకపల్లి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఉపాధ్యాయులు మాదగొని సుధాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దూరు, వట్టిపల్లితండా పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. పెద్దూరుకి చెందిన మాదగొని సుధాకర్‌గౌడ్ తండ్రి నాగయ్యగౌడ్ జ్ఞాపకార్థం మండలంలోని పెద్దూరు, వట్టిపల్లితండా, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జయపాల్‌తో పాటు ఉపాధ్యాయులు రఘురాంరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తెలకపల్లి: మండల కేంద్రానికి యువతి ఈ నెల 18న తెల్లవారుజామున ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పటికీ తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకి లభించకపోవడంతో యువతి తల్లి శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలియజేశారు.

బస్సు కోసం వినతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల, గుండూరు గ్రామాల మధ్యన స్కూల్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బస్సును నడపాలని గుండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఆర్టీసీ డిపోలో వినతి అందజేశారు. గుండూరులో 10వ తరగతి పాఠశాలకు ముకురాల గ్రామం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుంటారని, బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించి చదువుకునే అవకాశం కల్పించాలని డిపోలో అధికారులకు వినతి అందజేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే హైస్కూల్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బస్సును పాఠశాల వేలలో నడిపేలా చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్ సుభాషినిని ఆదేశించారు.



అభయారణ్యంలో ప్లాస్టిక్ సేకరణ

మన్ననూర్: పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం ప్రాంతంలో అటవీ శాఖ తలపెట్టిన ప్లాస్టిక్ పూర్తి నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసే ప్రక్రియను విస్తృతంగా కొనసాగిస్తున్నారు. మన్ననూర్ పరిసర ప్రాంతంతో ప్రారంభం అవుతున్న అభయారణ్యం మొదలుకొని అక్కడక్కడ అటవీ సిబ్బందిని ఏర్పాటు చేసి నల్లమల ప్రాంతంలోకి వస్తున్న వాహనాల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను సేకరిస్తుండటంతో పాటూ వాహనాలను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా ప్రతి వాహనదారుకు జూలై 1వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో అమలవుతున్న ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించడంతో పాటూ అటవీ శాఖ నిబంధనలను ఉపేక్షించి ప్లాస్టిక్ వస్తువులు కలిగిన వారికి విధించే జరిమానాలు, కఠినమైన చర్యల గురించి తెలియజేస్తున్నారు. వాహనదారుల నుంచి సేకరిస్తున్న ప్లాస్టిక్ వస్తువులను ఓ షెడ్‌లో భద్రపరిచి రీసైక్లింగ్ కేంద్రానికి తరలించే ఏర్పాటు చేస్తున్నారు.



మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద ప్లాస్టిక్‌ను సేకరిస్తూ.. ప్లాస్టిక్ నిషేధాన్ని తెలియజేస్తున్న వలంటీర్లు

విద్యార్థులకు రిలయన్స్ ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనుసూయ

నాగర్‌కర్నూల్: గతేడాది మొదటి సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అధిక మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఒకేషనల్ ఉర్దూ మీడియం గ్రూపు విద్యార్థులకు రిలయన్స్ ట్రెండ్స్ సౌజన్యంతో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రిలయన్స్ ట్రెండ్స్ చీఫ్ అసోసియేట్ మహ్మద్ బషీర్, డిపార్ట్‌మెంట్ మేనేజర్ కృతిరాజ్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.అనసూయ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. రిలయన్స్ దిగ్గజం లాంటి సంస్థలు బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, సమాజంపై అవగాహన, నేర్పరితనం, ఎదుటి వారిని మెప్పించి, ఒప్పించి మాట్లాడే విధానం ఈ వయసులోనే అలవర్చుకోవాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణిస్తే.. ఆర్థికంగా వెనుకబడిన వారికి నగదు ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని వెల్లడించారు. కళాశాల అభివృద్ధి, అధ్యాపకుల కృషిని అభినందించారు. కళాశాల సీనియర్ లెక్చరర్ బగవేణి నరసింహులుతో పాటు రవిప్రకాష్, రవీందర్ రెడ్డి, యూనస్, సత్యం, హరిత, శిరీష, తస్కిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో జేష్ఠమాసం ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు 12 మంది దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వ్రతాలు చేయడంతో భక్తులకు కోరిన కోరికలు, సిరి సంపదలు సిద్ధస్తాయని, విశేషంగా పుణ్యఫలితం భక్తులకు అందుతుందని రామాలయం ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ అన్నారు. ఆలయంలో ప్రతి నెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నారని అన్నారు. పౌర్ణమి శనివారం కావడంతో ఆలయంలోని సీతారామచంద్ర స్వాముల వారికి హనుమంతుడికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని శివాలయంలో పరమశివుడిని భక్తులు దర్శించుకున్నారు. రామాలయ అన్నప్రసాద కమిటీ సామూహికంగా అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ సభ్యులు శ్రీనివాసాచార్యులు, అర్థం రవీందర్, కరుణశ్రీ గొల్ల రాములు, టి.మల్లేష్, రమాదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలపై సీఎంను కలుస్తాం..

కొల్లాపూర్: పట్టణంలోని సాయికృప ఆస్పత్రి నిర్వాహకులపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు సూచించారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మంటపంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సమావేశమయ్యారు. సాయికృప ఆస్పత్రి నిర్వాహకులు కొండా శ్రీనివాసులుపై కొందరు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, దీన్ని తమ సంఘం ఖండిస్తోందన్నారు. ఆయనకు తామంతా అండగా ఉంటామన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావును కలుస్తామన్నారు. అవసరమైతే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీఎంను కలుస్తామని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆకుతోట శేషయ్య వెల్లడించారు. అంతకు ముందు సాయికృప ఆస్పత్రి వైద్యురాలు కొండా శ్రీదేవి మాట్లాడారు. వెల్టూరుకి చెందిన లక్ష్మీ తమ ఆస్పత్రిలో 5 సంవత్సరాల పాటు పనిచేసిందన్నారు. మెడికల్ దుకాణంలో డబ్బుల చోరీ జరిగిందని, దీనిపై తాము ఏడాది కిందట లక్ష్మీపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసు విచారణ జరుగుతోందని వివరించారు. ఆమె కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి మృతిచెందినట్లు పోలీసులు ధ్రువీకరించారని చెప్పారు. దీన్ని కావాలని వివాదం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకుతోట సుదర్శన్, అమరవాది స్వామి, గుంత బాలయ్య, పెండ్యాల వేణుగోపాల్, సూర్యుడు, భీంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

నీటి ఎద్దడి నివారించాలి

చారకొండ: మండలంలోని జూపల్లిలో వారం రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడింది. దాంతో గ్రామంలో ప్రజలు నిత్యం తాగేందుకు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో అక్కడక్క బోరు మోటార్లు ఉన్నా.. వాటి సరఫరా అంతంతగానే ఉందన్నారు. శనివారం గ్రామంలోని 1వ వార్డులో యువకులు చెడిపోయిన బోర్‌మోటార్‌ను బయటకు తీశారు. వాటికి మరమ్మతు చేపట్టి నీరు అందించాలని, సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలిపినా.. వారు పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత ఉన్నత అధికారులు చొరవ చూపాలని కోరారు.



బోర్‌మోటార్‌ను లాగుతున్న యువకులు

ఆర్థిక సాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మెకానిక్ పాండు అనారోగ్యంతో మృతి చెందినాడు. శనివారం సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వ పరంగా వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పిల్లల చదువులకు కృషి చేస్తామన్నారు. తిరుపతిరెడ్డి, వెంకటయ్య, రామస్వామి, విష్ణు, హమీద్ పాల్గొన్నారు.